క్లుప్తంగా

నేడు ప్రమాణ స్వీకారం

జనగామ: జనగామ మండలం పసరమడ్ల శివారు ఉషోదయ కన్వెన్షన్ హాల్‌లో ఉదయం నేడు (ఆదివారం) ఆర్యవైశ్య మహాసభ జిల్లా నూతన కార్యవర్గంతో పాటు అన్ని విభాగాల కమిటీల ప్రమాణ స్వీకార మహోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, ప్రముఖులు హాజరు కానున్నారు. ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా గంగిశెట్టి ప్రమోద్ కుమార్, తదితరులు ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు హాజరు కావాలని నిర్వాహకులు కోరారు.

నేడు రక్తదాన శిబిరం

స్టేషన్‌ఘన్‌పూర్: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ఘన్‌పూర్ పోలీసుశాఖ వారి ఆధ్వర్యంలో నేడు (ఆదివారం) డివిజన్‌కేంద్రంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సీఐ జి.వేణు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మాగార్డెన్స్ ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 9 గంటలకు నిర్వహించే రక్తదాన శిబిరానికి యువత స్వచ్ఛందంగా హాజరై రక్తదానం చేయాలని ఆయన కోరారు.

తిరుపతికి తరలిన భజన మండలి సభ్యులు




బచ్చన్నపేట: మండలంలోని బండనాగారం గ్రామానికి చెందిన రామలింగేశ్వర భజన మండలి సభ్యులు శనివారం తిరుమల తిరుపతి దేవస్థానానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా భజన మండలి అధ్యక్షుడు, అర్చకులు జంగిలి ఆంజనేయులు మాట్లాడుతూ తిరుపతిలో వెంకటేశ్వరస్వామి సమేత అలివేలు మంగ, పద్మావతిల సన్నిధిలో భజన చేసే భాగ్యం లభించడం పూర్వజన్మ సుకృతమన్నారు. భజన మండలి సభ్యులు బాలమల్లు, ధర్మయ్య, మల్లారెడ్డి, నర్సమ్మ, జ్యోతి, శ్రీనివాస్, రామకృష్ణ, రమేశ్, కిష్టయ్య ఉన్నారు.

'రాజకీయ లబ్ధి కోసమే బీఆర్‌ఎస్ శవ రాజకీయాలు'



పాలకుర్తి టౌన్: రాజకీయా లబ్ధి కోసమే మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శవ రాజకీయాలు చేస్తున్నాడని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ విమర్శించారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు లావుడ్యా భాస్కర్, మాజీ సర్పంచ్ యాకంతారావుతో కలిసి ఆయన మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గ నుంచి ప్రజలు ఎర్రబెల్లి దయాకర్‌రావును ఓడించినా అతనిలో మార్పు రాలేదన్నారు. గిరిజన యువకుడు శ్రీనునాయక్ ఆత్మహత్యను రాజకీయం చేస్తూ శవ రాజకీయాలతో తన ఉనికిని కాపాడుకుంటున్నాడని విమర్శించారు. శ్రీను కుటుంబానికి కాంగ్రెస్ అండగా అందుకుంటుందని అన్నారు. కృష్ణమూర్తి, శ్రీనివాస్, సోమయ్య గణేష్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని నమిలిగొండ గ్రామంలో విద్యుదాఘాతంతో సముద్రాల శ్రీనివాస్ అనే రైతుకు చెందిన పాడిఆవు శనివారం మృతిచెందింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం శ్రీనివాస్ తన వ్యవసాయ భూమిలో ఆవును మేపుతున్నాడు. అయితే అక్కడ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా కిందికి ఉండటంతో విద్యుత్‌వైర్లు తగిలి ఆవు అక్కడికక్కడే మృతిచెందింది. ప్రస్తుతం ఆవు సూడితో ఉందని, అకారణంగా విద్యుత్‌షాక్‌తో మృతిచెందిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఆవు ధర రూ.70వేల వరకు ఉంటుందని, ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ కంచె ఉంటే ప్రమాదం జరిగేది కాదని వాపోయాడు. ఈ విషయమై విద్యుత్‌శాఖ అధికారులు, ప్రభుత్వం స్పందించి ఆర్థిక సహాయం అందించి న్యాయం చేయాలని బాధితరైతు కోరుతున్నాడు.

పేకాటరాయుళ్ల అరెస్టు

దేవరుప్పుల: పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తుల్ని అరెస్టు చేసినట్లు ఎస్సై ఊర సృజన్‌కుమార్ తెలిపారు. శనివారం రాత్రి మండలంలోని కడవెండి గ్రామ ఎస్సీ కాలనీలో ఐదుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్న సమాచారం మేరకు దాడి చేయగా వారి వద్ద నుంచి నాలుగు సెల్‌ఫోన్‌లు, 2 వేల నగదు, పేకాట సెట్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న లావణ్య

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని, గ్రామాల్లో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్య శిరీష్‌రెడ్డి అన్నారు. మండలంలోని తానేదార్‌పల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధరను పొందాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో రైస్‌మిల్లర్ల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న గుప్తా, మంతెన ఇంద్రారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ మాచర్ల కుమారస్వామి, నాయకులు దుంపల పద్మారెడ్డి, సురేష్‌రెడ్డి, ఏపీఎం కుమారస్వామి, మండల సమాఖ్య అధ్యక్షురాలు మాచర్ల ప్రవంతి, శ్రీవెంకటేశ్వర గ్రామైక్య సంఘం బాధ్యులు ప్రియాంక, రమాదేవి, సరిత, సీఏలు రజని, పావనితోపాటు తదితరులు పాల్గొన్నారు.

తాటికొండలో..

మండలంలోని తాటికొండ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఇన్‌చార్జ్ డీపీఎం కవిత ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం కుమారస్వామి, సాధన గ్రామైక్య సంఘం బాధ్యులు స్వప్న, మమత, లక్ష్మి, స్వరూప, రమ, కాంగ్రెస్ నాయకులు ఎడమ కట్టమల్లు, బేతి రత్నాకర్‌రెడ్డి, పండుగ భద్రి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ అభివృద్ధికి సహకరించాలి

స్థానిక వ్యవసాయ మార్కెట్ అన్ని విధాల అభివృద్ధి జరిగేలా ట్రేడర్లు, డైరెక్టర్లు, వ్యాపారులు తమవంతు బాధ్యతగా సహకరించాలని ఏఎంసీ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్యశిరీష్‌రెడ్డి అన్నారు. ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ పాలకమండలి నూతన కమిటీ ప్రమాణస్వీకారం అనంతరం మొదటి సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. స్థానిక మార్కెట్ కార్యాలయంలో సెక్రటరీ జన్ను భాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో చైర్‌పర్సన్ మాట్లాడారు. ట్రేడర్లు, వ్యాపారులు మార్కెట్‌లోనే కొనుగోళ్లు చేపట్టాలని, తద్వారా మార్కెట్ అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, డైరెక్టర్లు, ట్రేడర్లు పాల్గొన్నారు.

'జర్నలిస్టుల హక్కుల సాధనే లక్ష్యం'

రఘునాథపల్లి: జర్నలిస్టుల హక్కుల సాధనే టీయూడబ్ల్యూజే (ఐజేయూ) లక్ష్యమని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ దస్తగిరి, జిల్లా కమిటీ సభ్యుడు రాసమల్ల రాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలో స్థానిక జర్నలిస్టుల నుంచి వారు ఇళ్ల స్థలాల దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా దస్తగిరి, రాజు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి టీయూడబ్ల్యూజే ముందుండి పోరాడుతుందన్నారు. హక్కుల సాధనలో నిరంతరం కృషి చేస్తుందని, గ్రామీణ ప్రాంత విలేకరులకు అక్రిడేషన్లు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం టీయూడబ్ల్యూజే కృషి ఫలితమన్నారు. ఈ నెల 30లోపు మండల, పట్టణాల్లో పని చేసే జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఆకుల మహేశ్, ప్రధాన కార్యదర్శి కందుల అనిల్, కోశాధికారి కొన్నె సతీష్, సీనియర్ జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

హర్షం

జఫర్‌గఢ్: జిల్లా ఆర్యవైశ్య మహాసభ జిల్లా కమిటీల్లో జఫర్‌గఢ్ మండలానికి చెందిన సభ్యులకు పెద్దపీట వేయడం హర్షణీయమని సంఘం మండల నాయకులు అన్నారు. శనివారం వారు మాట్లాడారు. ఈ కమిటీలో ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా రేవూరి రమేష్, కార్యదర్శిగా రేవూరి శ్రీనివాస్, జిల్లా ముఖ్యసలహాదారులుగా చిట్టిమళ్ల కృష్ణమూర్తి, గండె సీతారాములు, జోనల్ కమిటీ చైర్మన్‌గా గండె సోమన్న, సేవదల్ జిల్లా కార్యదర్శి గా బొనగిరి శ్రవణ్‌కుమార్, జిల్లా డైరెక్టర్లుగా దాంశెట్టి సోమన్న, యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా బెలిదే హరిశంకర్, కార్యదర్శిగా బొనగిరి నాగరాజు, బజ్జూరి సంతోష్‌కుమార్, మహిళా ఉపాధ్యక్షురాలుగా అంచూరి కమల, కార్యదర్శిగా దాంశెట్టి శ్రావ్య, డైరక్టర్లుగా ఇమ్మడి శ్వేత, దొడ్డ ఉమరాణి, పట్టూరి అంకిత, అక్షిత్‌కుమార్, సంఘం జిల్లా విద్యావిభాగం ప్రతినిధులుగా అంచూరి సురేష్ తదితరులు ఎన్నికైన వారిలో ఉన్నారని తెలిపారు.

మౌలిక వసతులు కల్పించాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీఏఓ రామారావు

బచ్చన్నపేట: మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి రామారావు నాయక్ అన్నారు. శనివారం మండలంలోని ఇటుకాలపల్లి, రామచంద్రాపూర్, కొన్నె, పడమటికేశ్వాపూర్, నాగిరెడ్డిపల్లి, గంగాపూర్, ఆలింపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ, తదితర వసతులు కల్పించాలన్నారు. టార్పాలిన్ కవర్లు, ప్యాడీ క్లీనర్‌లను అందుబాటులో ఉంచాలని, ధాన్యం తూకంను త్వరగా వేసేలా చూడాలని కేంద్రం నిర్వాహకులకు సూచించారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలిగించొద్దన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి విద్యాకర్‌రెడ్డి, ఏఈఓలు, కేంద్రం నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన



ప్రతిజ్ఞ చేయిస్తున్న కౌన్సిలర్ పద్మ

జనగామ రూరల్: అవగాహనతోనే బాల్యవివాహాలను నిర్మూలించవచ్చని స్కోప్ సంస్థ కౌన్సిలర్ పద్మ అన్నారు. శనివారం మండలంలోని వడ్లకొండ మండల పరిషత్ పాఠశాలలో బాల్య వివాహాల నిర్మూలన, బాలకార్మికుల హక్కులు, అక్రమ రవాణా తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినులు బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌పై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సాంఘిక దురాచారాల నిర్మూలనకు కృషి చేయాలని, ఇందుకు 1098 లేదా 100 డయల్ చేస్తే సంబంధిత అధికారులు తక్షణం చేరుకుని సమస్యను పరిష్కారిస్తారని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎండీ తహసిన్, నిమ్మరాంరెడ్డి, మాదవిలత, బొగ్గారపు శ్రీనివాస్, రాజేశ్వర్, రాజశ్రీ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



దాతలను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నర్మెట: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న కాశీవిశ్వనాథ ఆలయానికి దాత వేముల శ్రీలక్ష్మి-సదానందం దంపతులు, కూతుళ్లు నందిని, సింధుశ్రీలు రూ.10,116ల విరాళాన్ని శనివారం అందించారు. వారిని ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో సన్మానించారు. జంగిటి అంజయ్య, రాజబోయిన లక్ష్మినారాయణ, చల్ల మల్లయ్య, భూక్య తిరుపతి, ప్రతాప్, బాలయ్య, శ్రీధర్, వీరమల్లు, పవన్, పలువురు ఉన్నారు.

ఇందిరమ్మ కమిటీలను పారదర్శకంగా వేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వేస్తున్న ఇందిరమ్మ కమిటీలలో కాంగ్రెస్‌పార్టీలో మొదటి నుంచి పనిచేస్తున్న వారికి సముచితస్థానం కల్పిస్తూ పారదర్శకంగా కమిటీలు వేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు చేపూరి రాజశేఖర్ అన్నారు. మండలంలోని ఛాగల్లులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఘన్‌పూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కోసం మొదటి నుంచి పనిచేసిన వారికి గుర్తింపు ఇవ్వాలని, నామినేటెడ్, పార్టీ పదవుల్లో సముచితస్థానం కల్పించాలని ఆయన కోరారు. పార్టీలోకి ఇటీవల వచ్చిన కొందరు వ్యక్తులు ఒంటెద్దుపోకడలతో వ్యవహరిస్తున్నారని, అది పార్టీకి ఏమాత్రం మంచిదికాదన్నారు. పార్టీలో పాత, కొత్త అందరినీ సమన్వయం చేస్తూ ఇందిరమ్మ కమిటీలు వేయాలని,యువతకు అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



జనగామ: డిపాజిట్ పత్రాలు అందజేస్తున్న యూనియన్ ప్రతినిధులు



దేవరుప్పులలో..

జనగామ : పట్టణానికి చెందిన త్రీ వీలర్ ఆటో మెకానిక్ బోయిని కరుణాకర్ గుండె పోటుతో ఇటీవల మృతి చెందాడు. కాగా, శనివారం యూనియన్ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. త్రీ వీలర్ యూనియన్ అధ్యక్షుడు ఎండి మహమూద్, ఉపాధ్యక్షులు కె.నర్సింహులు, కార్యదర్శి ఇట్టబోయిన రమేష్ ఆధ్వర్యంలో సంఘం తరుపున రూ.లక్ష 30వేల నగదును కరుణాకర్ పిల్లల పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, పత్రాలను అందజేశారు. సహచరుని కుటుంబానికి ఎప్పుడు అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ కోశాధికారి బాలస్వామి, కార్యవర్గ సభ్యులు ఇట్టబోయిన మహేష్, కుమార్, మైపాల్, అనిల్, లక్ష్మణ్, యాకుబ్ తదితరులు ఉన్నారు.

దాతృత్వం

దేవరుప్పుల: ఓ నిరుపేద కుటుంబ యజమాని అకాల మరణంతో చలించిన పలువురు ఆయన కూతురు వైష్ణవి అభ్యున్నతి కోసం ఉదార దాతృత్వంతో బాసటగా నిలిచిన సంఘటన పెద్దమడూరులో చోటుచేసుకుంది. పెద్దమడూరుకు చెందిన దూడల సోమయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుని కూతురు వైష్ణవి స్థానిక హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతోంది. బాలిక ఆర్థికస్థితిని గమనించిన ఉపాధ్యాయ బృందం రూ.7 వేలు, శంకరాచార్య సేవాసమితి పక్షాన సమితి నిర్వహకుడు రవికాంత్ రూ.15 వేలు కలిపి మొత్తం రూ.25 వేలను పోస్టాఫీసులో ఫిక్స్‌డ్ చేసి డిపాజిట్ పత్రాలను శనివారం అందజేశారు. బాలిక విద్యాభివృద్ధికి సేవాసమితి నిరంతర తోడ్పాటు ఉండేలా కృషి చేస్తామని బెహరా రవికాంత్ తెలిపారు. హెచ్ఎంలు డి.అశోక్, పద్మారాణి, ఉపాధ్యాయులు ఉన్నారు.

అభినందనీయం



జనగామ రూరల్: తెలంగాణ రాష్ట్రంలో ప్రమాదాలకు గురైన కల్లుగీత కార్మికులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్న హైదరాబాద్ నాగోల్ సుప్రజ హాస్పిటల్ ఎండీ సిగ విజయ్ కుమార్ సేవలు అభినందనీయమని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బూడిద గోపి అన్నారు. దేవరుప్పుల మండల కేంద్రానికి చెందిన బుడుగు సత్యనారాయణ నాలుగు రోజుల క్రితం తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు పడి వెన్నెముకకు, ఛాతిలో గాయాలవడంతో సుప్రజ ఆస్పత్రిలో చేర్పించారు. కాగా, శనివారం గోపి ఆస్పత్రి ఎండీతో కలిసి ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 6 లక్షల విలువ చేసే వెన్నెముక ఆపరేషన్, వైద్యాన్ని ఆస్పత్రి యాజమాన్యం ఉచితంగా అందించినట్లు తెలిపారు. సంఘం రాష్ట్ర మహాసభలో విజయ్‌కుమార్ ఇచ్చిన హామీ మేరకు ఇప్పటి వరకు 60 మందికి పైగా గీత కార్మికులు తాటి చెట్లపై నుంచి పడితే వారికి శాస్త్ర చికిత్సల కోసం రూ. 2కోట్ల విలువైన వైద్యం అందించడం జరిగిందన్నారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది, సత్యనారాయణ భార్య ఉన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

జనగామ రూరల్: పోరాటాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతామవుతాయని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మీట్యానాయక్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. రైతులకు షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. బెల్ట్ షాపులు విచ్చలవిడిగా వెలస్తున్నా.. అధికారులు చర్యలు తీసుకోవడం లేదని, సమస్యలు పరిష్కరించకపోతే సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సాంబరాజు యాదగిరి, మండల కార్యదర్శి బోడ నరేందర్, ఉపేందర్, రాములు, రాజు, దుర్గా ప్రసాద్, ఆనందం, పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీసీపీ

పాలకుర్తి: రక్తదానం చేయడం వల్ల ఎంతో మందికి ప్రాణదానం చేయడం జరుగుతుందని డీసీపీ రాజమహేంద్రనాయక్ అన్నారు. పోలీసుల అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో శనివారం రక్తదాన శిబిరాన్ని డీసీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రక్తదానం చేస్తే మరొకరికి ప్రాణదానం చేసినట్లేనని తెలిపారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దరావత్ రాజేశ్ నాయక్, పాలకుర్తి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసు హరీశ్, కొడకండ్ల మండల నాయకుడు దుడిమిట్ల యాకన్న, తదితరులు రక్తదానం చేయగా వారికి డీసీపీ చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఏసీపీ అంబటి నర్సయ్య, సీఐ మహేందర్ రెడ్డి, ఎస్సైలు లింగారెడ్డి, పవన్‌కుమార్, సృజన్‌కుమార్, చింత రాజు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీగా మరోసారి నర్సిరెడ్డిని గెలిపించాలి'



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

జఫర్‌గఢ్: ఎమ్మెల్సీగా మరోసారి అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కానుగంటి రంజిత్‌కుమార్ కోరారు. ఖమ్మం, నల్గొండ వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని యూటీఎఫ్ ఆధ్వర్యంలో మండలంలోని ఉప్పుగల్లు, కూనూర్, తిమ్మంపేట, జఫర్‌గఢ్, తిడుగు, హిమ్మత్‌నగర్, కేజీబీవీ, మోడల్‌స్కూల్, తమ్మడపల్లి (జి) తదితర పాఠశాలలో సంఘం నాయకులు, ఉపాధ్యాయులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నర్సిరెడ్డిని యూటీఎఫ్ బలపరుస్తున్నట్లు తెలిపారు. యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మంగు జయప్రకాశ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల సంక్షేమం కోసం తనదైన శైలిలో నర్సిరెడ్డి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కందుల శ్రీనివాస్, చిక్కుడు శ్రీనివాస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వారకల్యాణం



చిల్పూరు: బుగులు వేంకటేశ్వర స్వామి సన్నిధిలో శనివారం భక్తుల సమక్షంలో గోవింద నామస్మరణ మధ్య అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ వైభవంగా వార కల్యాణం నిర్వహించారు. భక్తులకు హైదరాబాద్‌కు చెందిన అజయ్‌కుమార్-ప్రశాంతి, పరమేశ్వర్‌లు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ మోహన్‌బాబు, శాశ్వత అభివృద్ధి దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు-కిరణ్మయి, తదితరులు పాల్గొన్నారు. అలాగే బుగులు వెంకటేశ్వరస్వామి వారిని స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ ఏడీఏ వసంత సుగుణ, ఏవోలు చంద్రన్‌కుమార్, నజీరుద్దీన్, ఏఈఓలు వినయ్‌కుమార్, నర్సింహులు, యాకూబ్‌లు దర్శించుకున్నారు.

అంగన్‌వాడీల్లో సిబ్బంది లేక ఇబ్బందులు



అంగన్‌వాడీ టీచర్‌తో మాట్లాడుతున్న రాములు

బచ్చన్నపేట: మండలంలోని లింగంపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది లేక చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం మండల కమిటీ సభ్యుడు తాడెం రాములు అన్నారు. శనివారం సీపీఎం బృందం అంగన్ వాడీ కేంద్రాలను సందర్శించింది. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ గ్రామంలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయన్నారు. అందులో మొదటి కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ లేదని, మూడో కేంద్రంలో ఆయా లేదని తెలిపారు. దీంతో గ్రామస్తులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి



ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న ఐలేష్, తదితరులు

స్టేషన్‌ఘన్‌పూర్: కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తున్న ఏకైక యూనియన్ ఐఎన్‌టీయూసీ 327 అని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం ఐలేష్ అన్నారు. ఐఎన్‌టీయూసీ 70వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డివిజన్ కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద యూనియన్ జెండావిష్కరణ కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. 70 సంవత్సరాలుగా ఐఎన్‌టీయూసీ కార్మికుల హక్కులను కాపాడేందుకు నిర్విరామంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ ఘన్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు యాదగిరి, రాష్ట్ర కార్యదర్శి రాజ్‌కుమార్, ఎండీ.ఫయాజ్, జి.సుధాకర్, ఎస్.పెద్దిరెడ్డి, నర్సింహారెడ్డి, వీరస్వామి, వాసం శ్రీధర్, లక్‌పతి, దేవిక, లత, అరుణ, రాజు, అశోక్, కుమార్, సత్తి, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ సేవలు మరువ లేనివి

జనగామ రూరల్: టీఎస్ ఈఈయూ 327 యూనియన్ కార్మికులకు చేసిన సేవలు మరువలేనివని సంఘం జిల్లా కార్యదర్శి నరేందర్ రెడ్డి అన్నారు. యూనియన్ ఆవిర్భవించి 70 వసంతాలు పూర్తి అయిన సందర్భంగా శనివారం జనగామ విద్యుత్ సబ్ డివిజన్ ఆఫీస్ గేటు ఎదుట 327 జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.వీరాంజనేయులు, ట్రెజరర్ కే. నరోత్తం రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, విజయ్ కుమార్, తిరుమలరెడ్డి మధు, రాజు, నేతాజీ, చిరంజీవి, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

చిల్పూరు: నవంబరు 4వ తేదీన చిల్పూరు మండల కేంద్రంలో నిర్వహించే సీపీఎం 3వ మహాసభను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాపర్తి రాజు, మండల కార్యదర్శి సాదం రమేశ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పలు గ్రామాల్లో మహాసభ కరపత్రాలను పంపిణీ చేశారు. పేద ప్రజలు, కార్మికులు, రైతులు, పంచాయతీ, హమాలీ, ఆటో కార్మికులు సమస్యల పరిష్కారం కోసం మహాసభలో నిర్ణయాలు తీసుకోనున్న నేపథ్యంలో ప్రతీ ఒక్కరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. సాదం రమేశ్, పోలు సంపత్, సాదం శ్రీనివాస్, గద్ద కుమార్, పోలు శ్రీనివాస్, సాదం రాజు, రవి, రామరాజు, మల్లయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

శానిటరీ న్యాప్‌కిన్ల పంపిణీ



తరిగొప్పుల: అవధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థినులకు శానిటరీ న్యాప్‌కిన్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు ఖుషిక, షైనీ, హాసినీలను హెచ్ఎం నెల్లుట్ల జానకి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమలో అనిల్, శైలజ, కృష్ణజ, సుమలత, సీఆర్పీ మహాలక్ష్మి, పీఈటీ బాల థెరిసా పాల్గొన్నారు.

నియామకం



చిల్పూరు: యాదవ హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడిగా కొండాపూర్ గ్రామానికి చెందిన గాలి రాజు ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన యాదవ హక్కుల సమితి సమావేశంలో జిల్లా అధ్యక్షుడు తాటికొండ వెంకటేష్‌యాదవ్ సమక్షంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారికి వెంకటేష్ యాదవ్ నియామక పత్రాలు అందజేశారు. మండల అధ్యక్షుడిగా ఎన్నికైన రాజు మాట్లాడుతూ త్వరలో మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి యాదవులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తానని అన్నారు. ఉప్పరి గణేష్, మారబోయిన రమేష్, రాజయ్య, తిరుపతి, పోషయ్య, గట్టయ్యలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ల బైండోవర్

దేవరుప్పుల: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న మూడు టిప్పర్లను పట్టుకున్నట్టు ఎస్సై ఊర సృజన్‌కుమార్ తెలిపారు. మండలంలోని ముస్‌పహాడ్ ఏరియా నుంచి ధర్మగడ్డతండా పరిధి పత్తి మిల్లు వద్దకు నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలిస్తున్న సమాచారం మేరకు మూడు టిప్పర్లను పట్టుకున్నామని, తదుపరి చర్యల తీసుకునేందుకు తహసీల్దార్ హుస్సేన్‌కు అప్పగించామన్నారు. అనుమతులు లేకుండా ప్రకృతి వనరులైన ఇసుక, మట్టి తరలిస్తే చట్టపరంగా చర్యలు అనివార్యమని ఎస్సై హెచ్చరించారు.

విద్యుత్ ఓవర్‌లోడ్ సమస్యను పరిష్కరించాలి

జఫర్‌గఢ్: విద్యుత్ ఓవర్‌లోడ్ సమస్యను పరిష్కరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేష్‌గౌడ్ కోరారు. ఈ మేరకు స్థానిక విద్యుత్ ఏఈ విశ్వసాయితికి శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూనూర్‌లో విద్యుత్ ఓవర్ లోడ్ సమస్యతో ఇళ్లల్లో టీవీలు, ఫ్యాన్లు కంప్యూటర్లు, లైట్లు కాలిపోతున్నాయన్నారు. ఈ విషయాన్ని స్థానిక విద్యుత్ సిబ్బంది దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఓవర్ లోడ్ సమస్య తలెత్తకుండా చూడాలని కోరారు.

మహాసభకు తరలిన నాయకులు



బచ్చన్నపేట: మండలంలోని ఆలింపూర్ గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు మహాసభకు తరలివెళ్లారు. శనివారం వరంగల్ జిల్లాలో నిర్వహించిన మాదిగల ధర్మయుద్ధ మహాసభకు నాయకులు వెళ్లారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మాదిగలను ప్రభుత్వాలు కేవలం ఓటర్లుగా మాత్రమే చూస్తున్నారని, మాదిగలకు పలు రంగాల్లో న్యాయం జరిగే వరకు పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పాకాల కుమారస్వామి, చల్లాపురం శ్రీకాంత్, పాకాల బాలకృష్ణ, శ్రీనివాస్, గంధమల్ల మల్లేష్ , మాల్ల యాదగిరి పాల్గొన్నారు.